క్లుప్తంగా

పాఠశాలలకు పుస్తకాల పంపిణీ



మాగనూర్: జూన్ 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో శనివారం స్థానిక ఎమ్మార్సీలో మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాలను పంపిణీ చేశారు. మాగనూర్ సీఆర్పీ ఎల్లాగౌడ్ ఆయా పాఠశాలల హెచ్ఎంలకు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పుస్తకాలను అందజేశారు. 12న నుంచి పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఊట్కూరు: మండలంలోని ఎడివెల్లిలో మాజీ ఎంపీపీ వెంకట్రామరెడ్డి సోదరుడు రాజశేఖర్ రెడ్డి శనివారం ఉదయం గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి రాజశేఖర్‌రెడ్డి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతికిగల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, నాయకులు చంద్రకాంత్‌గౌడ్, ఆనంద్‌గౌడ్, రాజేందర్, రాజిరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ ఎంపిక



ఊట్కూరు: మండలంలోని నిడుగుర్తి పాఠశాలకు చెందిన భరత్‌కుమార్ నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు హెచ్ఎం శ్రీనివాస్‌కాంబ్లే తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఉపాధ్యాయబృందం అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పార్వతి, నర్సింహ, ధనుంజయ్, ఆంజనేయులు, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మదనాపురం: మండలంలోని అజ్జకొల్లు గ్రామానికి చెందిన దేవేందర్ కుటుంబ నివాసం ఉంటున్న పూరిగుడిసె విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఈ నెల 4న దగ్ధమైంది. ప్రమాదంలో ఇంట్లోని వస్తువులు, ఇంటి సామగ్రి, బియ్యం, బట్టలు పూర్తిగా కాలిపోయాయి. దిక్కుతోచని స్థితిలో ఉన్న వారికి స్థానిక కాంగ్రెస్ నాయకులు మేమున్నామంటూ బియ్యంతో పాటు నగదును అందజేశారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించడంతో పాటు ఆర్థికంగా ఆదుకునేందుకు తాము అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, రాజిరెడ్డి, రాములుగౌడ్ ఉన్నారు.

రేపు వాహనాల వేలం

ఆత్మకూర్: ప్రొహిబీషన్, ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం ఆత్మకూర్‌లో సోమవారం వాహనాల వేలం నిర్వహిస్తున్నామని సీఐ యమునాధర్ రావు తెలిపారు. వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్రవాహనాలు వేలం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతుందని, ఆసక్తి ఉన్న వారు నిర్ణీత రుసుము చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం

కొత్తకోట రూరల్: దళిత కుటుంబానికి చెందిన బాలిక ఆత్మహత్య చేసుకుని 50రోజులు కావస్తున్నా పోలీసులు కారణమైన వ్యక్తిపై నేటికీ చర్యలు తీసుకోవడం లేదని, బాధితురాలి కుటుంబ సభ్యులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి జిల్లా కన్వీనర్ గోవింద్ అన్నారు. వనపర్తి మండలం అచ్యుతాపురం గ్రామానికి చెందిన సంతోష, వెంకటయ్యకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. రెండో కుమార్తె పావని కొత్తకోటలోని ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ 10వ తరగతి పూర్తి చేసింది. పావని పెద్దమందడి మండలంలోని జగత్‌పల్లికి తన అమ్మమ్మ ఇంటి వద్దకు వేసవి సెలవులకు వెళ్లింది. జగత్‌పల్లికి చెందిన రాఘవేందర్ అనే యువకుడు పావని ఫోన్‌కు అనేసార్లు కాల్ చేయగా చివరగా ఏప్రిల్ 17న అతడి నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. అదే రోజున పావని ఆత్మహత్య చేసుకుంది. పావని ఆత్మహత్యపై తమకు అనుమానం ఉందని పోలీసులకులో ఫిర్యాదు చేసినా నేటికీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం బాధితురాలి కుటుంబ సభ్యులతో కలిసి పెద్దమందడిలో విలేకరుల సమావేశంలో నిర్వహించారు. కార్యక్రమంలో చైతన్యభారతి, సైదమ్మ, చెన్నకేశవులు, నీలమ్మ, చెన్నమ్మ, బుజ్జమ్మ, రామస్వామి, బాల స్వామి, కుర్మయ్య, చెన్నయ్య తదితరులు ఉన్నారు.

ముందస్తు వర్షాలతో కష్టాలు



జొన్న పంటకు బోరు ద్వారా నీటిని అందిస్తున్న యాదగిరిగౌడ్



కౌలుకు తీసుకున్న పొలంలో స్ప్రింక్లర్ల ద్వారా నీటిని అందిస్తున్న వెంకట్‌రెడ్డి

- వారం రోజులుగా మొఖం చాటేసిన వాన
- వేసిన పంటలకు నీరందించడానికి రైతులు అవస్థలు

మద్దూరు: మే నెలలో ముందస్తు వర్షాలు కురువడంతో అన్నదాత మురిసిపోయాడు. అనుకున్న సమయం కంటే ముందే వర్షాలు పడడంతో విత్తనాలు వేయడానికి అదును రావడంతో అన్నదాత పొలంలో ఆరుతడి పంటలైన జొన్న, కంది, పెసర, రాగులు, పత్తి విత్తనాలు నాటాడు. రోహిణి కార్తెలో వేసిన పంట అధిక దిగుబడి వస్తుందని విత్తనాలు వేసుకుంటే.. వరుణుడు మొకం చాటేయడం.. ఎండలు దంచి కొట్టడంతో భూమిలో వేసిన విత్తు మొలకెత్తకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. వారం రోజుల క్రితం వేసిన విత్తనాలు మొలకెత్తకపోవడంతో పొలానికి నీటిని అందించడానికి నానా తంటాలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. కొందరైతే స్ప్రింక్లర్ల ద్వారా నీటిని అందిస్తుంటే, మరికొందరు ట్యాంకర్ల ద్వారా పంటను బతికించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. పత్తి వేసినవారు కడవలతో నీటిని అందిచాల్సిన పరిస్థితి నెలకొంది.

ఉమ్మడి మద్దూరు మండలంలో..

ఉమ్మడి మద్దూరు మండలంలో 1,480 ఎకరాల్లో జొన్న, 1,550 ఎకరాల్లో కంది, 30 ఎకరాల్లో రాగులు, 35 ఎకరాల్లో పెసళ్లు, 180 ఎకరాల్లో పత్తి పంటను ఇప్పటికే సాగు చేశారు. మేనెలలో సాధారణ వర్షపాతం 24.7 ఎంఎం కాగా ఈ ఏడాదిలో 119.0 ఎంఎం వర్షం కురిసింది. అంటే దాదాపు 382 శాతం ఎక్కువ వర్షపాతం నమోదైంది. వారం రోజులుగా ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో భూమిలో వేసిన విత్తనాలు మొలకెత్తకపోవడంతో నీటిని అందించాల్సిన పరిస్థితి నెలకొంది. మరికొన్ని చోట్ల మొలకెత్తిన విత్తనాలు వాడిపోయే పరిస్థితి నెలకొంది. తప్పని పరిస్థితుల్లో పంట కాపాడుకోవడానికి రైతు నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

బోరు మోటారుతో నీటిని అందిస్తున్నా



నాకున్న మూడెకరాల పొలంలో ముందస్తు వర్షాలు కురువడంతో ఎకరంలో జొన్న విత్తనాలు వేశా. విత్తనాలు వేసి వారం గడిచినా మొలకలు రాకపోవడంతో బోరు మోటారు ద్వారా పొలానికి నీళ్లు అందించాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షాలు కురిస్తే మిగిలిన రెండెకరాల్లో కూడా విత్తనాలు సిద్ధం చేసుకున్నా. వర్షాలు ముఖం చాటేయడంతో విత్తనాలు ఇంట్లో అలాగే ఉంచాను.

– యాదగిరి గౌడ్, కొత్తపల్లి

వర్షాలు పడకపోతే తీవ్రంగా నష్టపోతా



నేను నాపొలంతోపాటు మరో 12 ఎకరాలు కౌలుకు తీసుకొని జొన్న 4 ఎకరాల్లో, కంది 4 ఎకరాలు, 4 ఎకరాల్లో పత్తి పంటను వేశాను. ముందస్తు వర్షాల వల్ల లాభం జరుగుతుందనుకున్నాం. ఎండలు, వర్షాలు కురువకపోవడంతో స్ప్రింకర్లతో పంటలకు నీటిని అందిస్తున్నా. వర్షాలు కురువకపోతే తీవ్రంగా నష్టపోవాల్సిన పరస్థితి ఉంది.

– వెంకట్‌రెడ్డి, రైతు, కొత్తపల్లి

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ వేడుకలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

మరికల్ : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో చదివిన పూర్వ విద్యార్థులు శనివారం 42 ఏంళ్లకు ఒకే వేదికపై కలుసుకున్నారు. ఈ సందర్భంగా తాము చదివిన పాఠశాల పరిసరాలను పరిశీలించి పాత జ్ఞాపకాలను స్మరించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో వారికి విద్యాబుద్ధులు నేర్పిన పూర్వ ఉపాధ్యాయులను సన్మానించుకొని పాదభివందనాలు చేసుకున్నారు. 42 ఏంళ్ల కు కలుసుకోవడంతో ఒక్కొక్కరు తమ పాత జ్ఞాపకాలతోపాటు ప్రస్తుతం చేస్తున్న వృత్తిని వివరించారు. కార్యక్రమంలో పూర్వఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పరికరాల గుర్తింపు శిబిరం విజయవంతం

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని గ్రౌండ్ స్కూల్ ఆవరణలో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే.అరుణ సహకారంతో శనివారం నిర్వహించిన దివ్యాంగుల అవయవ, చలన పరికరాల గుర్తింపు శిబిరం విజయవంతమైంది. ఏఎల్ఐఎంసీవో వారి సౌజన్యంతో దివ్యాంగులకు చలన పరికరాలకు 100 మంది హాజరై దరఖాస్తులు అందజేయగా.. నిర్వాహకులు వాటిని నమోదు చేసుకున్నారు. ఇలా పారదర్శకంగా అవసరానుగుణంగా సదరం సర్టిఫికెట్ శాతం చూసి వైద్యుల పర్యవేక్షణలో నిర్వహించడంతో దివ్యాంగులు చాలా హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ, బీజేవైఎం నాయకులు మాట్లాడుతూ.. దీనికి సహకరించి నారాయణపేటలో నిర్వహించడంలో ముఖ్యపాత్ర పోషించిన ఎంపీ డీకే అరుణకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎల్ఐఎంఓ బృందం, వికలాంగుల వయోవృద్ధుల ట్రాన్స్ జెండర్ల సాధికార శాఖ బృందం, బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.



శిబిరంలో పాల్గొన్న దివ్యాంగులు

ప్రభుత్వ బడిలోనే బంగారు భవిష్యత్

కృష్ణ: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్ లభిస్తుందని గెజిటెడ్ హెచ్ఎం సంతోషి పేర్కొన్నారు. కున్సి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఆవాస ప్రాంతమైన ఆలంపల్లిలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఆరో తరగతిలో చేరబోయే 16మంది విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడి కున్సి ఉన్నత పాఠశాలలో చేర్పించాలిని కోరారు. ఈ సందర్భంగా కున్సి ఉన్నత పాఠశాలకు సంబంధించిన వివరాలు తెలిపే కరపత్రాలను పంపిణీ చేశారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు తల్లిదండ్రులు సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింహులు, ఖాసి, అలీ, నరేందర్, సౌమ్యభారతి, నాగేశ్ పాల్గొన్నారు.

తపస్ ఆధ్వర్యంలో బడిబాట రథం

కోస్గి రూరల్: మండల కేంద్రంలో తపస్ ఆధ్వర్యంలో శనివారం బడిబాట రథం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో శంకర్‌నాయక్, తపస్ జిల్లా గౌరవాధ్యక్షుడు మల్లికార్జున్ ఎంఈవో ఆవరణలో జెండా ఊపి ప్రారంభిచారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో మెరుగైన విద్యనందిస్తున్నామని, ఉచిత విద్య, మెరుగైన బోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, దుస్తులు, బ్రేక్‌ఫాస్ట్, పౌష్టికాహార మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అంజయ్య, మండలాధ్యక్షుడు పరందాములు, గుండుమాల్ మండలాధ్యక్షుడు, రాఘవేందర్, ప్రధాన కార్యదర్శి అనంతయ్య, సహాయ కార్యదర్శి రాఘవేందర్‌గౌడ్, నవీన్, నరేశ్,, సత్యనారాయణ, రామకృష్ణ పాల్గొన్నారు.

పల్లెర్లలో బడిబాట

మద్దూరు: ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని పల్లెర్లలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పాఠశాలలో పేర్లు నమోదు చేసుకున్నారు. హెచ్ఎం పావని మాట్లాడుతూ.. ఈ ఏడాది నుంచి మన పాఠశాలలో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన, మొదటి తరగతి నుంచి ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన, ఏఐ ద్వారా విద్యాబోధన కూడా అందుబాటులో ఉందని తెలియజేశారు. గ్రామస్తులు ప్రైవేట్ బడులకు పిల్లలను పంపకుండా ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ లక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.



కోస్గిలో బడిబాట రథాన్ని ప్రారంభిస్తున్న ఎంఈవో శంకర్ నాయక్

ఉపాధ్యాయుల ఇంటింటి ప్రచారం

నర్వ: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతిలో సాధిచిన ఉత్తీర్ణతను చూపిస్తూ ప్రచారం చేశారు. 10 మంది విద్యార్థులు 500కుపైగా మార్కులు సాధిచారని, పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్స్‌ను ఉచితంగా అందజేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మన్యం, మల్లేశ్, రాజు, శ్రీనువాసులు, సురేశ్, స్వరూప, స్నేహ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు నియంత్రించడంలో విఫలం

అమరచింత: నకిలీ విత్తనాలను నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందని, వానాకాలం వరి పంట కొనుగోళ్లు పూర్తయిన నేటికీ రైతు ఖాతాల్లో బోనస్ డబ్బులను జమ చేయలేదని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలో శనివారం రైతు సంఘం మండల రెండో మహాసభ నిర్వహించగా..ఏఐకేఎస్ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో వెంకటేష్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్యాకేజీని సద్వినియోగం చేసుకోవాలి

నారాయణపేట రూరల్: యాత్రా స్థలాలకు ఆర్టీసీ సంస్థ ప్రత్యేక ప్యాకేజీతో నడిపించే బస్సులను సద్వినియోగం చేసుకోవాలని నారాయణపేట మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందునామాజీ అన్నారు. శనివారం వేర్వేరుగా ఆర్టీసీ మార్కెటింగ్ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్యాకేజీ వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యానగుంది మొదలుకొని అరుణాచలం వరకు ప్రత్యేక రాయితీతో బస్సులు నడపడం ప్రజలకు సౌకర్యంగా ఉందని అన్నారు. యాత్రలకు సామూహికంగా వెళ్లే కుటుంబాలు, విద్యార్థినులు, వివిధ సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ మార్కెట్ కమిటీ సభ్యులు హన్మంతు, సురేశ్‌కుమార్ పాల్గొన్నారు.



వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న నందునామాజీ

రేషన్ తూకాల్లో మోసం



తూకంపై వేసిన ఖాళీసంచి



ఖాళీ సంచిపై పెట్టిన బియ్యాన్ని తూకం వేస్తున్న డీలరు

- ఒక్కో వ్యక్తి వద్ద 7కిలోలు గండి
- బియ్యాన్ని మిగిలించుకుంటూ అక్రమాలకు పాల్పడుతున్న డీలర్లు

ధన్వాద: మండల కేంద్రంలోని పలు రేషన్ దుకాణాల నిర్వాహకులు ప్రజలకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం తూకంలో మోసాలు చేస్తూ డీలర్లు గండి కొడుతున్నారు. ఒక వ్యక్తి ఒకనెలకు తీసుకునే రేషన్ బియ్యంపై 2, 5 కేజీల వరకు తక్కువ వేస్తూ బియ్యాన్ని మిగిలించుకుంటూ అక్రమాలకు పాలపడుతున్నా.. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

మూడు నెలల బియ్యంలో మూడుసార్లు గండి

ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. ఒక వ్యక్తికి అంత్యోదయ కార్డు అయితే మూడుసార్లు వేలిముద్రలు పెట్టి మూడుసార్లు 35 కేజీల ప్రకారం బియ్యాన్ని తీసుకోవాలని.. అదే తెల్లరేషన్ రేషన్ కార్డు దారుడు రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వానికి రెండు కలిపి 6సార్లు వేలిముద్ర పెట్టాల్సి వస్తుంది. ఒకసారి తూకంపై రెండున్నర కేజీల బియ్యం తుక్కవ వచ్చేలా ఖాళీ సంచులను వేసి దానిపై బియ్యాన్ని ఉంచి తూకం చేస్తున్నారు. అంటే ఒక అంత్యోదయ కార్డుదారుడు మూడుసార్లు వేలి ముద్రపెట్టి విత్‌డ్రా చేస్తే 7.5 కిల బియ్యం తక్కువ వస్తుంది. ఇలా ప్రతి రేషన్‌దారుడి వద్ద 7 కిలోలపైనే రేషన్ బియ్యం తగ్గించి డీలర్లు మిగిలించుకుంటున్నారు.

పరిశీలన చేస్తాం



అధికారులను పంపించి పరిశీలన చేస్తాం. తూకాల్లో మోసం చేయడం చట్టరీత్యా నేరం. ఇలాంటివి ఎక్కడ జరుతున్నా తమకు సమాచారం అందించండి. పరిశీలన చేసి నిజమని నిరూపణ అయితే వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటాం.

– సింధూజ, తహసీల్దార్, ధన్వాద

మహ్మద్ ప్రవక్త బోధనలు ఆచరణీయం



ఊట్కూరులో బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

సాక్షి, నెట్‌వర్క్: మహ్మద్ ప్రవక్త బోదించిన సూత్రాలు మానవళికి ఆచరణీయం అని మౌలానాలు తెలిపారు. శనివారం జిల్లావ్యాప్తంగా ముస్లింలు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈద్గా మస్‌జిద్‌ల నుంచి ముస్లింలు ఈద్గాహ్‌కు ర్యాలీగా వెళ్లారు. త్యాగాలకు ప్రతీక బక్రీద్ అని మౌలానాలు ప్రపంచ శాంతి కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్ మూబారక్ చెప్పుకొన్నారు. పొటేళ్లను బలిచ్చి బంధువులు, స్నేహితులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు, మాజీ ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఈద్గాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్త్ ఏర్పాటు చేశారు.

❖ ఊట్కూరులోని చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన వేదిక వద్ద మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డి, నాయకులు నారాయణరెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, దత్తు, కృషిద్, అస్మద్ తదితరులు పాల్గొన్నారు.

❖ మక్తల్ మండలంలోని చిట్యాల, అనుగొండ, లింగంపల్లి, కర్ని, సంగంబండ, మంతన్‌గోడ్, గుడిగండ్ల, జక్లేర్, భూత్పూర్ ఈద్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, రహీంపటేల్, అబ్దుల్‌కవి, షాబుద్దీన్, ఇసాక్, అమీద్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

❖ మద్దూరుతో పాటు రెనివట్ల, నందిపాడ్, దోరేపల్లి తదితర గ్రామాల్లోని ముస్లింలు ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మద్దూరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఆనవాయితీ ప్రకారం గ్రామపెద్దల సమక్షంలో ఆకువక్క పంపిణీ చేశారు.

❖ కోస్గి పట్టణ కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం బక్రీద్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

❖ కృష్ణా మండల వ్యాప్తంగా ముస్లింలు ఉదయం నుంచి మజీద్‌లకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

❖ మాగనూర్‌లో ముస్లింలు మజీద్‌ల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్యామలమ్మ, సింగిల్‌విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

❖ నర్వ మండల కేంద్రంతో పాటు పెద్దకడ్మూర్, కల్వాల్, రాయికోడ్, రాంపూర్‌లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షుడు సాహెబ్ హుస్సేన్, మత పెద్దలు ఖలీల్, రఫీ, అశ్వక్, మౌలాలీ, ఇక్బాల్, ఫజల్, పెద్దమౌలాలి, బాబుమియ్యా పాల్గొన్నారు.

❖ మరికల్ మండలంలోని ఎలిగండ్ల, తీలేర్, జిన్నారం, అప్పంపల్లి, మాధవరంలో ముస్లింలు బక్రీద్ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

❖ నారాయణపేట మండలంలోని జాజాపూర్, కోటకొండ, కొల్లంపల్లి తదితర గ్రామాల్లో ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

❖ ధన్వాడ మండల కేంద్రంలో బక్రీద్‌ను పురస్కరించుకొని ముస్లింలు ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి, గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

❖ కొత్తపల్లి మండలంలోని నిడ్జింత, భూనీడ్, గోకుల్‌నగర్, పెద్దాపూర్‌లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

❖ దామరగిద్ద, క్యాతన్‌పల్లి, మొగుల్‌మడ్క, కాన్‌కుర్తి తదితర గ్రామాల ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక నాయకులు బస్వంత్‌రాజ్ ఇంట్లో తేనేటి విందు స్వీకరించారు. కార్యక్రమంలో ఎండీ ఖాజా, అనీప్, నబీ, హాజీ, చాంద్‌పాషా, మునీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.



తేనేటి విందులో ముస్లింలు



కోటకొండ దర్గాలో..



నిడ్జింతలో..



ధన్వాడలో..



మక్తల్‌లో..



కృష్ణాలో..



కోస్గిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



మాగనూర్‌లో..